క్లుప్తంగా

మెరిట్ జాబితా విడుదల

నెహ్రూసెంటర్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌హెచ్ఎం పథకంలో కాంట్రాక్టు పద్ధతిలో చేపట్టి నియామకాలకు సంబంధించిన మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ రవిరాథోడ్ మంగళవారం తెలిపారు. 1:3 నిష్పత్తిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సెలక్షన్ కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తారని అన్నారు. ఈ నెల 26వ తేదీన వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలని డీఎంహెచ్ఓ తెలిపారు. మెరిట్ జాబితాను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మహబూబాబాద్. తెలంగాణ.జీఓవీ.ఇన్ లో పొందుపర్చామన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



మహబూబాబాద్ అర్బన్ : రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జి. శ్రీనివాస రావు తెలిపారు. జిల్లా స్థాయి సబ్ జూనియర్ పోటీలో పి.ఘనాస్కర్ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడన్నారు. పీఈటీ నసీరుద్దీన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలేరు విద్యార్థులు..



నెల్లికుదురు : కురవి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్స్ బాలుర కబడ్డీ పోటీలకు మండలంలోని ఆలేరు విద్యార్థులు బానోత్ సాయిచరణ్, ఎండీ సమీర్, ఎల్.నవదీప్ ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి 28వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు.

ఆటో యూనియన్ ఎన్నిక



కురవి : మండల కేంద్రంలో ఆటో యూనియన్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాట్యాల వీరన్న, ఉపాధ్యక్షులుగా బాలు నాయక్, రవి, కోశాధికారిగా కానుగంటి రాజు, కార్యదర్శులుగా సుచలాచారి, వీరన్న, గౌరవ అధ్యక్షులుగా కిన్నెర ఉపేందర్, శ్రీను, శ్రీరాం అశోక్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జీఓ 12ను సవరించాలి



మహబూబాబాద్ : భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, జీఓ 12ను సవరించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు రాములు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుంచే సంక్షేమ పథకాలు అమలు చేయాలని అక్రమంగా ప్రైవేట్ బీమా కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్లు తిరిగి బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆకుల రాజు, కోటేశ్వరరావు, ఉప్పలయ్య, శంకర్, వెంకన్న, విష్ణు, ఉస్మాన్, మౌలానా,అంకుస్, వెంకటేష్, భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



దంతాలపల్లి : మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు అల్లం సాయికుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎంపీ ఈటల రాజేందర్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ పరామర్శించారు.ఈ సందర్భంగా సాయికుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. సాయికుమార్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. సాయికుమార్ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.

ఇంటిపై పిడుగు.. గోడలకు బీటలు



గంగారం : మండలంలోని మడగూడెం గ్రామానికి చెందిన అలం కాంతమ్మ ఇంటి గోడపై సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగు పడింది. ఇంట్లో ఉన్న టీవీ, కరెంట్ వైర్లు కాలిపోయాయి.గోడలు బీటలు వారాయి. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరు లేరు.

పశువైద్యశాలలో సిబ్బంది కొరత

మూగజీవాలకు అందని వైద్యం
- ఇబ్బందులు పడుతున్న రైతులు

కురవి : మండల కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్యశాలలో సిబ్బందిలేక ఇబ్బందులు పడుతున్నారు. కురవి వైద్యశాల పరిధిలో తట్టుపల్లి, సీరోలు మండల కేంద్రంలోని పశువైద్యశాల ఉప కేంద్రాలు పని చేస్తున్నాయి. ఈ మూడు కేంద్రాల్లోనూ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఆయా కేంద్రాల్లో తెల్లని పశువులు 9,201, నల్లని పశువులు (గేదెలు, దున్నపోతులు) 5,100, గొర్రెలు 26,706, మేకలు 8,368 ఉన్నాయి. వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో పశువులు, మేకలు, గొర్రెలకు చికిత్స అందించడం కష్టంగా మారింది. కురవి ఆస్పత్రిలో ఒక వైద్యుడు మాత్రమే పనిచేస్తున్నాడు. అసిస్టెంట్,



కురవిలోని ప్రాథమిక పశువైద్యశాల

అటెండర్ (ఆఫీస్ సబార్డినేట్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కురవిలో పనిచేయాల్సిన అటెండర్ జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పనిచేస్తుండడం వల్ల పోస్టు ఖాళీగా ఉంది. అలాగే తట్టుపల్లిలోని సబ్ సెంటర్‌లో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పోస్టు, అటెండర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. సీరోలు సబ్ సెంటర్‌లో అదే పరిస్థితి నెలకొంది. మూడు పశువైద్యశాలలో ఖాళీగా పోస్టులు ఉండడం వల్ల మూగజీవులకు సకాలంలో వైద్యం అందడంలేదు. అధికారులు స్పందించి పోస్టులను భర్తీ చేయాలని, లేనిపక్షంలో తాత్కాలిక సిబ్బందిని నియమించే అవకాశం కల్పించి వేతనాలు ఇస్తే వైద్య సేవలు సక్రమంగా అందుతాయని వేడుకుంటున్నారు.

సౌకర్యాలు ఉన్నాయి



ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉంది. సిబ్బంది ఉంటే వైద్య సేవలు మరింత అందజేసే అవకాశం ఉంటుంది. ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలున్నాయి. వైద్య సిబ్బంది కావాల్సి ఉంది.

- రాజేందర్, పశువైద్యుడు

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

- డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేక్

మహబూబాబాద్ అర్బన్ : నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ అన్నారు. డీఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 50 వేల పైగా ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటుందని, కనీసం 5వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే, దశలవారీగా నిరసన ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. నాయకులు ప్రవీణ్, శాంతికుమార్, వీరభద్రం, సూర్యప్రకాష్, పురుషోత్తం, శివవర్మ, దిలీప్, యుగంధర్, రమేష్, కిరణ్, ప్రణయా, శ్రీకాంత్, నిరుద్యోగులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: ర్యాలీలో నినాదాలు చేస్తున్న డాక్టర్ వివేక్, రాకేశ్‌రెడ్డి

వసతి గృహాలు ఏర్పాటు చేయాలి

గూడూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా బాలురు, బాలికలకు ప్రభుత్వ వసతి గృహాలను ఏర్పాటు చేయాలని డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. జాతీయ కార్యదర్శి మాలోత్ శాంతికుమార్, రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రం, కార్యదర్శి కేలోతు సాయికుమార్, గుగులోత్ సూర్యప్రకాశ్, శివ వర్మ, శ్రీకాంత్, దిలీప్, రమేష్, కిరణ్, యుగంధర్ పాల్గొన్నారు.

'ఇళ్లు పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలం'



తొర్రూరు : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి దయాకర్‌రావు ఆందోళనలో పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండీ యాకూబ్‌లతో కలిసి దయాకర్‌రావు మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సీపీఎం నాయకులు కొమ్మనబోయిన యాకయ్య, జమ్ముల శ్రీనివాస్, దర్గయ్య, స్వామి, జితేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అబద్ధాల పునాదులపై పాలన

పెద్దవంగర : అబద్ధాల పునాదులపై రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సాగిస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. తొర్రూరు బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి దయాకర్‌రావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

తొర్రూరు రూరల్ : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషిచేసి వివిధ కారణాలతో మరణించి కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు ఊరట

- బీజేపీ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

మరిపెడ : జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు ఊరట లభించిందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. మంగళవారం మరిపెడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న జీఎస్టీ సంస్కరణలతో సామాన్యులకు ఆర్థిక భారం తగ్గిందన్నారు. 324 వస్తువులపై జీఎస్టీ భారం తగ్గి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాడని దుయ్యబట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గాదె రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్య కాంతమ్మ, పట్టణ, మండల అధ్యక్షులు మంగమ్మ, గంగాధర్, నాయకులు భాస్కర్, బింగి రమేష్ యాదవ్ పాల్గొన్నారు.



మరిపెడ: మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



మరిపెడ: పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ తదితరులు



దంతాలపల్లి: దుర్గామాత వద్ద నాయకులతో కలిసి పూజలు నిర్వహిస్తున్న హుస్సేన్ నాయక్

దోర్నకల్/మహబూబాబాద్ రూరల్ /గూడూరు /బయ్యారం/మరిపెడ/దంతాలపల్లి: జిల్లావ్యాప్తంగా పలు గ్రామాల్లో మంగళవారం రెండో రోజు శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దుర్గామాత గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. దేవిశరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్, ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్, వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, అలువాల ఉపేందర్, వీసారపు శ్రీపాల్‌రెడ్డి తదితరులు దర్శించుకొని పూజలు చేశారు.

బతుకమ్మ వేడుకలు



మహబూబాబాద్ రూరల్ /కురవి/గంగారం : కురవి మండల కేంద్రంలో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బతుకమ్మను పేర్చారు. అనంతరం మహిళలతో కలిసి నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. బతుకమ్మ పాటలు పాడి కోలాటమాడారు. అలాగే గంగారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి ప్రత్యూష, వైద్యసిబ్బంది బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మహబూబాబాద్ పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి.

నాసిరకం చీరలన్నరు.. ఒక్క చీర ఇయ్యలే

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ నిరసన

కురవి : మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం రాత్రి మహిళలు బతుకమ్మలతో ఆడిపాడారు. వేడుకల్లో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పువ్వులను పూజించే పండుగ బతుకమ్మ పండుగకు మాజీ సీఎం కేసీఆర్ మహిళలకు చీరలు అందించారని తెలిపారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు నాసిరకం చీరలని బీఆర్ఎస్‌ను విమర్శించారు. కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ అధికారంలో ఉండి కూడా మూడు రోజులైనా ఒక్క చీర ఇవ్వలేదని బతుకమ్మను ఎత్తుకుని నిరసన వ్యక్తం చేశారు.

ప్రమాణం చేయాలి.. లేదంటే ముక్కు నేలకు రాయాలి

తాను 10 బస్తాల యూరియా తీసుకున్నట్లు ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రు నాయక్, మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌లు కురవి వీరన్న సన్నిధిలో ప్రమాణం చేయాలని లేదంటే ముక్కు నేలకు రాయాలని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సవాల్ విసిరారు. మంగళవారం సత్యవతిరాథోడ్ కురవిలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.



బతుకమ్మను ఎత్తుకున్న సత్యవతిరాథోడ్

కేసీఆర్ మంజూరు చేసిన నిధులను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

మేడారంలో గత సీఎం కేసీఆర్ ఇచ్చిన డబ్బులతో చేసిన పనులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని విమర్శించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రగల్భాలు పలికారని, ఒక్కరిని చూపిస్తే వారిని కలుస్తామని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట లాలయ్య, నాయకులు బోడ శ్రీను, బాదె నాగయ్య, నెహ్రూ, కిషోర్, కిన్నెర మల్లయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

నెహ్రూసెంటర్ : ఈ నెల 28వ తేదీన మానుకోటలో నిర్వహించనున్న లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. లంబాడీల రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ సమావేశం మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ... ఆత్మగౌరవ సభకు పార్టీలకు అతీతంగా తండాలు, గ్రామాల నుంచి వేలాదిగా తరలిరావాలని కోరారు. లంబాడ విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జాతి కోసం జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు.

రేపు మరిపెడలో బంజారాల ర్యాలీ, సభ..

మరిపెడ రూరల్ : ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించే చర్యను వ్యతిరేకిస్తూ ఈ నెల 25న మరిపెడలో నిర్వహించే బంజారుల ర్యాలీ, సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ నంగారాబేరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య రాంమూర్తినాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని లూనావత్‌తండాలో లంబాడీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంమూర్తినాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో సుప్రీం కోర్టులో కేసు వేసి ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ర్యాలీ, సభకు అధికసంఖ్యలో లంబాడీలు తరలిరావాలని కోరారు.



నెహ్రూసెంటర్: సమావేశంలో అభివాదం చేస్తున్న లంబాడీ జేఏసీ నాయకులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



యూసఫ్(ఫైల్)

తొర్రూరు : తొర్రూరుకు చెందిన ఎస్‌కే యూసఫ్ (51) ఈ నెల 21న వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై తొర్రూరు నుంచి దంతాలపల్లికి వెళ్తున్నాడు. కాగా ఫత్తేపురం సమీపంలో రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడగా యూసఫ్‌ను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య కౌసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి. ఉపేందర్ తెలిపారు.

జయపురం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి..

నర్సింహులపేట : మండలంలోని జయపురం గ్రామానికి చెందిన నెలకుర్తి మోహన్‌రెడ్డి(70) పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై మాలోత్ సురేష్ కథనం ప్రకారం.. జయపురం గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి భార్య 20 ఏళ్ల క్రితమే మరణించింది. దీంతో ఒంటరిగా, అనారోగ్యానికి గురై మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. జీవితంపై విరక్తిచెంది వారంక్రితం పురుగుల మందుతాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు మహేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో రిటైర్డ్ పీడీ..

దంతాలపల్లి : మండలంలోని బొడ్లాడకు చెందిన రిటైర్డ్ పీడీ నందారపు రామచంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. రామచంద్రయ్య మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

ఎన్ఎస్ఎస్‌తో నాయకత్వ లక్షణాలు

మహబూబాబాద్ అర్బన్ : ఎన్ఎస్ఎస్‌తోనే విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ శిక్షణ శిబిరం ముగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సదానందం మాట్లాడుతూ.. పర్యావరణ రక్షణ సామాజిక లక్ష్యంగా జమాండ్లపల్లి వార్డు వాసులు ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

తొర్రూరు రూరల్ : మండలంలోని చింతలపల్లి గ్రామంలో మంగళవారం సమత జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజనేయులు మాట్లాడారు. ప్రోగాం ఆఫీసర్ నారాయణ, వలంటీర్లు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంబురాలు హాస్యాస్పదం

నెహ్రూసెంటర్ : జీఎస్టీ పేరుతో దేశ ప్రజలపై వేల కోట్ల భారం మోపి నేడు జీఎస్టీ తగ్గించడంతో ప్రజలు సంబురాలు చేసుకుంటున్నారని అనడం హాస్యాస్పదమని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో పార్టీ పట్టణ కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

నరేష్ రెడ్డి విగ్రహావిష్కరణ



మహబూబాబాద్ రూరల్ : స్నేహ యూత్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నూకల నరేష్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాల వేసి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నవయుగ యూత్ క్లబ్ అధ్యక్షులు వంకాయలపాటి లెనిన్ బాబు మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా నరేష్ రెడ్డి రాజకీయ, స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారన్నారు. నూకల అభినవ్ రెడ్డి, నాయకులు నూకల సుధీర్ రెడ్డి, ముదిగొండ విశ్వనాథం, జంగం రవి, రామారావు, బొమ్మర శీను, కన్న శ్రీనివాస్, శివరామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

ఒకే వేదికపై ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

మరిపెడ రూరల్ : మరిపెడ మండలంలోని పురుషోత్తమయాగూడెంలో స్నేహయూత్ వ్యవస్థాపక అధ్యక్షుడి విగ్రహావిష్కరణలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్, మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మంగళవారం హాజరయ్యారు. ఇద్దరు ఒకే సమయంలో వేదికపైకి నరేష్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. కాగా బీచ్‌రాజుపల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌ను బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కొనసాగుతున్న క్రీడలు

నెల్లికుదురు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న జిల్లా షూటింగ్ బాల్ పోటీలు మంగళవారం కొనసాగాయి. 33 జిల్లాల నుంచి వచ్చిన 66 బాల,బాలికల ఈ పోటీల్లో తలపడుతున్నాయి.

కుల నిర్మూలన చేపట్టాలి

కొత్తగూడ : గ్రామస్థాయి నుంచి ఆచరణాత్మకంగా కుల నిర్మూలన చేపట్టాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసి జిల్లా నాయకుడు పుల్లన్న అన్నారు.

నగదు రహిత లావాదేవీలు చేపట్టాలి

కేసముద్రం : ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు నగదు రహిత లావాదేవీలు చేపట్టాలని జిల్లా ఏపీడీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరపల్లిలో మదర్ థెరిసా గ్రామైక్య సంఘం, స్వయం సహాయక సంఘాలసభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలలో మొబైల్ ద్వారానే చెల్లింపులు చేయాలన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్ : హమాలీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు అన్నారు. హమాలీ యూనియన్ జిల్లా మహాసభ జగన్నాథం భవన్‌లో మంగళవారం నిర్వహించారు. సభలో కుంట ఉపేందర్, ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, అంబటి వీరస్వామి, రాములు, పురుషోత్తం, మోహన్, మల్లయ్య, బత్తుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలి

గూడూరు : ఆదికర్మ యోగి అభియాన్‌తో వెనుకబడిన గిరిజన గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగాలని ఎంఈఓ జె.ర

సంక్షిప్త సమాచారం

వికుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలో ఆదికర్మ యోగి అభియాన్‌లో ఎంపికైన 12 గ్రామాల్లోని పలు శాఖల అధికారులకు, గ్రామస్థాయిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు.

ఆదికర్మ యోగి అభియాన్ గ్రామాల ఎంపిక

కొత్తగూడ: కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 2వ తేదీన ప్రారంభించే ఆదికర్మ యోగి అభియాన్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించేందుకు గ్రామాలను ఎంపిక చేసినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని క్రీడా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడ, కొత్తపల్లి, జంగవానిగూడెం, సాధిరెడ్డిపల్లి, ముస్మి, గోవిందాపూర్, బత్తులపల్లి, గోపాలపూర్, కార్లాయి, తాటివారివేంపల్లి, ఈశ్వరగూడెం గ్రామాలు ఎంపికైనట్లు తెలిపారు.

దసరా సెలవులు ఇవ్వాలి

నెహ్రూసెంటర్ : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు దసరా సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ (ఏఐటీయూసీ అనుబంధం) అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిర్ర లక్ష్మీనర్సమ్మ, ఎల్లారీశ్వరీ అన్నారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో సమావేశం మంగళవారం నిర్వహించారు.

అంగన్‌వాడీలో పోషణమాసం

డోర్నకల్/నెల్లికుదురు : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరోగ్యకర బాల్యం అందుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి తెలిపారు. డోర్నకల్ పరిధిలోని కిరిటాపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో సీడీపీఓ మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.అలాగే నెల్లికుదురులో పోషణమాసం సందర్భంగా బతుకమ్మ ఆడుతూ పోషకాహారంపై ప్రదర్శన నిర్వహించారు.

సన్మానం

కురవి : మండలంలోని నల్లెల్ల శివారు గాజతండాకు చెందిన విద్యార్థిని బానోత్ అక్షయ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మంగళవారం అయ్యగారిపల్లి గ్రామంలో శాలువాతో ఘనంగా ఆమెను సత్కరించారు.

కారోబార్‌గా తీసుకోవద్దు

నర్సింహులపేట : అవినీతికి పాల్పడిన కారోబార్ రామనబోయిన వెంకన్నను విధుల్లోకి తీసుకోవద్దని మంగళవారం నర్సింహపురం బంజర గ్రామస్తులు ఎంపీడీఓ రాధికకు ఫిర్యాదు చేశారు. మారుపంగు వీరన్న, భయ్యు మహేష్, నర్సయ్య, రవీందర్ తదితరులు ఫిర్యాదు చేశారు.

లైట్లు, మైక్‌సెట్ చోరీ

తొర్రూరు రూరల్ : మండలంలోని వెలికట్ట గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఏర్పాటు చేసిన లైట్లు, మైక్‌సెట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి చోరీ చేశారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

మరమ్మతు చేపట్టాలి

నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని క్యాబిన్ రోడ్డు మరమ్మతులను వెంటనే చేపట్టాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సామ పాపయ్య డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బురదమయంగా మారిన రోడ్డుపై నిరసన తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు వేయించాలని కోరారు. గువ్వ శ్రీను, రమేష్, రవి పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

మహబూబాబాద్ రూరల్ : బాలు నాయక్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య బాలు నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో అనాథలు, వితంతువులు, వృద్ధులకు ఆహారం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఒక పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిరాశ్రయులకు తోడ్పాటు అందించి సాయం చేయాలని కోరారు.

దాశరథి కమలమ్మకు సంతాపం



దాశరథి రంగాచార్యతో కమలమ్మ (ఫైల్)

చిన్నగూడూరు : ప్రముఖ రచయిత దాశరథి రంగాచార్య సతీమణి కమలమ్మ మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె మరణవార్త విని చిన్నగూడూరు వాసులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎకరాకు ఒక బస్తా యూరియా ఇవ్వాలి

బయ్యారం : రైతులకు ఎకరానికి ఒక బస్తా యూరియా చొప్పున పంపిణీ చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరికీ యూరియా అందించాలన్నారు.

పదిరోజులైనా యూరియా ఇవ్వలే..



యూరియా టోకెన్‌ను చూపుతున్న కిషన్ రెడ్డి

మరిపెడ రూరల్ : మరిపెడ మండలం గుండెపూడి గ్రామంలో ఈ నెల 14న రైతులకు యూరియా టోకెన్లు పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నూకల కిషన్‌రెడ్డి హైదరాబాద్ నుంచి వచ్చి టోకెన్ తీసుకున్నాడు. పది రోజులైన ఇప్పటివరకు బస్తా యూరియా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

బైక్ ఢీ..ముగ్గురికి గాయాలు

నర్సింహులపేట : మండలంలోని నర్సింహులపేట నుంచి కౌసల్యదేవిపల్లికి వెళ్లే రోడ్డుపై మంగళవారం ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. చిన్నగూడురు ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న కౌసల్యదేవిపల్లికి చెందిన ఆపరేటర్ శేఖర్, ఎదురుగా వస్తున్న ఇస్సంపల్లి అనిల్ బైక్‌ను ఢీకొన్నారు. వీరితో మరో మహిళకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వీరిని మానుకోట ఆస్పత్రికి తరలించారు.